11న గ్రీవెన్స్ డే రద్దు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఈనెల 11వ తేదీ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించాల్సిన గ్రీవెన్స్ డేను అనివార్య కారణాలవల్ల రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి అర్జీదారులు వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కేంద్రానికి రావద్దని తెలిజయేశారు.

విలీనంతో వేతనాలు బంద్

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి అర్బన్‌లో మేజరు పంచాయతీగా ఉన్నదాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేస్తామంటే తమ బతుకులు బాగుపడుతాయని అందరూ భావించారు. జీవనప్రమాణాలు పెరుగుతాయని ఆశించారు. పంచాయతీల్లో పని చేసే పారిశుద్ద కార్మికులు వేతనాలు పెరిగి, కుటుంబానికి కాస్త ఆసరా దొరుకుతుందని భావించారు. విలీనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశారు. తీరా విలీనం అయ్యాక వారి బతుకులు రోడ్లపాలవడంతో లబోదిబో మంటూ విలపిస్తున్నారు. ఆరు నెలలుగా జీతం ఇస్తే ఒట్టు. కరవమంటే కప్పకు కోపం..విడమంటే పాముకు కోపం అన్న చందాగా శెట్టిపల్లి పంచాయతీ పారిశుద్ద కార్మికులు బతుకులు అగమ్యగోచరంగా తయారయ్యింది.

శెట్టిపల్లి పంచాయతీ. తిరుపతి అర్బన్‌లో మేజరు పంచాయతీ. మంగళం, శెట్టిపల్లి, వినాయకనగర్, మిట్టగాంధీపురం, సిఆర్‌ఎస్ క్వార్టర్స్, చెన్నాయ్‌గుంట, శెట్టిపల్లి హరిజనవాడ, ఉప్పరపాళెం, సప్తగిరినగర్ గ్రామాలతో పంచాయతీ ఉండేది. శెట్టిపల్లి పంచాయతీనికి తిరుపతి కార్పొరేషన్‌లో కలిపేందుకు యువ నాయకులు భూమన అభినయ్‌రెడ్డి చొరవ చూపడంతో ఏడాది కింద శెట్టిపల్లి పంచాయతీలోని కొన్ని గ్రామాలు మినహా అన్నింటిని తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం చేశారు. చెన్నయ్‌గుంట, మిట్టగాంధీపురం, పాతమంగళం గ్రామం, సప్తగిరినగర్‌ను కలిపి న్యూ మంగళం పంచాయతీగా ఏర్పాటు చేశారు. గతంలో శెట్టిపల్లి మేజరు పంచాయతీగా ఉన్నప్పుడు పంచాయతీలో 20 మంది పారిశుద్ద కార్మికులు పని చేసేవారు. కార్పొరేషన్ విలీనంతో వారిలో 12 మందిని కార్పొరేషన్‌లో విలీనం చేశారు. మిగిలిన 8 మందిని ప్రస్తుతం మిగిలిన గ్రామాల్లోతో ఏర్పడిన పంచాయతీలోనే కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్ విలీనంతో తమ బతుకులు కాస్త బాగుపడతాయనకున్న నిరుపేదలైన కార్మికులకు పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందాగా తయారైంది. కార్పొరేషన్‌లో విలీనం అయిన 12 మంది పారిశుద్ద కార్మికులకు వేతనాలు పెరగకపోగా కార్పొరేషన్ నుంచి కనీసం నెలవారీ జీతాలు కూడా ఇవ్వలేదు. విలీనం తర్వాత కూడా కార్మికులు కుటుంబ పరిస్థితులు తెలిసిన పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరు నెలల పాటు పంచాయతీ నుంచే గతంలో ఇస్తున్న వేతనాలను కార్మికులకు చెల్లించారు. ముందుగానే చిన్న పంచాయతీ, ఆదాయం తక్కువ కావడంతో కార్మికులందరికి వేతనాలు చెల్లించలేని పరిస్థితి. దీంతో విలీన కార్మికులు పంచాయతీ వేతనాలు ఇవ్వడం నిలిపివేసింది. కార్పొరేషన్ కూడా వారి గురించి పట్టించుకోవడం లేదు. ఇంకా ఆర్డర్స్ రాలేదు. చేద్దాం..చూద్దాం అంటూ కార్పొరేషన్ అధికారులు చెబుతుండడంతో ఆరు నెలలుగా వేతనాలు లేక, రెక్కాడితేగాని డొక్కాడిన కార్మికులు వెట్టిచాకరీ చేస్తూనే ఉన్నారు. అధికారులు వారిపై కనీకరం చూపకపోవడం శోచనీయం. ఇప్పటికైన అధికారులు స్పందించి, తమను ఆదుకోవాలని కార్మికులు వేడుకుంటున్నారు. ఆ దిశగా ఆదికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వేకువ జాము నుంచి కష్టపడుతున్నాం
వెంకటేశ్వర్లు, ఉప్పరపాళెం

పంచాయతీ ప్రజలు నిద్రలేవక ముందే, వేకువజాము నుంచి పంచాయతీని శుభ్రపరిచేందుకు కష్టపడుతున్నాం. పంచాయతీ నీట్‌గా ఉందంటే మా కష్టం ఎంతో ఉంది. నిరంతరం కష్టించే తమను అధికారులు ఆదుకోవాలి.

అప్పల పాలవుతున్నాం : టి.తిరుపాల్, ఉప్పరపాలెం

ఆరు నెలలుగా జీతాలు లేక అప్పలు చేసి మరి కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. 22 సంవత్సరాలుగా పంచాయతీని నమ్ముకుని పని చేశాను. ఇప్పడు విలీనం తర్వాత వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి తమకు వేతనాలు ఇవ్వకుంటే కుటంబాలు రోడ్డుపాలే.

ఎవ్వరో ఒకరు జీతాలు ఇవ్వండి : అమ్ములు, మిట్టగాంధీపురం

శెట్టిపల్లి మేజరు పంచాయతీలో పని చేస్తున్న మమల్ని కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కొన్ని రోజులు మా మొర ఆలకించి పంచాయతీ జీతాలు ఇచ్చింది. ఇప్పడు ఇవ్వలేమని చెప్పింది, మరో పక్క కార్పొరేషన్ అధికారుల్లో స్పందన లేదు. ఎవ్వరో ఒకరు జీతాలు ఇచ్చి మమ్మల్ని ఆదుకోండి.

ఆరు నెలలుగా అలమిటిస్తున్నాం : శంకర, మంగళం

గత ఆరు నెలలుగా జీతాలు లేక అలమటిస్తున్నాం. రోజూ పనులు చేయించుకుంటున్నారే తప్ప, జీతాలు ఇవ్వడం లేదు.కనీకరం చూపాలని అనేకసార్లు అధికారులను వేడుకున్నాం. ఇక నైనా స్పందించాలి.ఆరు నెలలుగా జీతాల్లేకపోతే ఎలా బతుకుతాం అనుకుంటున్నారు.

'కమలం'తో సైకిల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కమలం పార్టీ బిజెపితో జనసేన, టిడిపి పొత్తు ఆ పార్టీలకు లాభం చేకూరుస్తుందా? నష్టం వస్తుందా? అన్నదే హాట్ టాపిక్‌గా మారింది. వాస్తవాలను పరిశీలిస్తే ఆ పార్టీలకు లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2014 తిరుపతి ఎన్నికల సభలో అప్పటి ప్రధాని అభ్యర్థి, ఇప్పటి ప్రధాని మోడీ, టిడిపి, జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌తో కలిసి శ్రీవారి సాక్షిగా నవ్యాంధ్రకు విభజన చట్టాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. పదేళ్లపాటు ప్రత్యేక హోదా కల్పిస్తూ, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు రాజధాని నిర్మాణానికి కేంద్రం తమవంతు సహకారం అందిస్తుందని చెప్పారు. అయితే ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేర్చకపోగా, రాజధాని నిర్మాణానికి చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి ఇచ్చి వెళ్లారు. రాష్ట్రాభివృద్ధికి 5 లక్షల కోట్ల రూపాయల విలువ చేసే కేంద్ర పరిశ్రమలను తీసుకొస్తామని సెలవిచ్చారు. పదేళ్లపాటు పాలన సాగించారు. చంద్రబాబు ఐదేళ్లు, జగన్ ఐదేళు పూర్తయ్యిందే తప్ప కేంద్రానికి జనసేన, వైసిపి, టిడిపిలు దాసోహమయ్యాయి. ఇంత ద్రోహం చేస్తున్న బిజెపితో మళ్లీ టిడిపి పొత్తు పెట్టుకోవడంపై తిరుపతి, చిత్తూరు జిల్లాల ఓటర్లు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు.

టిడిపి, జనసేన శ్రేణులు బిజెపితో పొత్తుపై పెదవి విరుస్తున్నారు. ముఖ్యంగా పుంగనూరు, పలమనేరు, చిత్తూరు నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను శాసించే స్థాయిలో ముస్లీం ఓటర్లు ఉన్నారు. పూతలపట్టు, జీడీనెల్లూరు, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల్లో దళితులు ఎక్కువగా ఉండడంతో వారి ఓట్లు బిజెపికి పడే పరిస్థితి ఉండదన్నది విశ్లేషకుల అంచనా. శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోనూ శాసించే స్థాయిలో లేకపోయినా గణనీయంగానే ముస్లీం, క్రిస్టియన్ ఓటర్లు ఉన్నారు. బిజెపి ఒక్క సీటు కూడా ఈ రాష్ట్రంలో లేనప్పటికీ రాష్ట్రాన్ని రాజ్యమేలుతోంది. సోమవారం మూడు పార్టీల కూటమి అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. అలాగే తిరుపతి పార్లమెంట్ స్థానాన్ని బిజెపి కోరుతోంది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మోడీపై వ్యతిరేకతతో టిడిపి, జనసేన అభ్యర్థులపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. ఏదిఏమైనా బిజెపితో పొత్తు టిడిపి, జనసేనలకు లాభం కంటే నష్టమే ఎక్కువన్న చర్చ నడుస్తోంది. వైసిపి ఒంటరిగా పోటీ చేసినప్పటికీ కేసుల భయంతో అణగిమణగి ఉంటుంది. ఏదిఏమైనా రాష్ట్రంలో 'మత' రాజకీయానికి మూడు పార్టీలు కొమ్ముగాస్తున్న నేపథ్యంలో త్రిముఖ పోటీ నెలకొనే అవకాశం ఉంది.

నూతన సచివాలయం ప్రారంభం

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటి సిఎం, ఎంపి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని పెద్దకాల్వ పంచాయతీ తూగుండ్రం పంచాయతీ సచివాలయాలని, రైతు భరోసా కేంద్రాన్ని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, నియోజవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి భారీ సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఏకాంబరం, తూగుండ్రం సర్పంచ్ శ్రీబాబు, ఎంపిటిసి వాణిశ్రీ, ఆదికేశవ రెడ్డి, చిట్టిబాబు, జాన్ సుందరం, లోకనాథ యాదవ్, రాజేంద్ర రెడ్డి, మోహన్ రెడ్డి, ఎంపిపి అనిత, వైస్ ఎంపిపి హరిబాబు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధే ధ్యేయం: డిప్యూటి సిఎం

ప్రజాశక్తి - వెదురుకుప్పం / ఎస్ఆర్ పురం: మహిళాభివృద్ధియే జగనన్న ధ్యేయమని రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి అభ్యర్థి కృపాలక్ష్మి, సర్పంచ్ హరిత కుప్పయ్య ఆధ్వర్యంలో శనివారం సిఎం ఫొటోకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ మహిళల భవితకు వారి స్వావలంబనకు భరోసా ఇచ్చేలా వైయస్సార్ చేయూత పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం ఈ పథకం ద్వారా మండలంలోని 1591 మంది ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గానికి మహిళకు నాలుగో విడతగా రూ.3.68కోట్లు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రమణ, ప్రసాద్‌రెడ్డి, కుప్పయ్య, జనార్ధన్ ఏపిఎం రోజా గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా అభివృద్ధి చేస్తున్నాం: ఎంపి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రెడ్డప్ప

ప్రజాశక్తి - రామకుప్పం: వైసిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు నిస్వార్థంగా అభివృద్ధిని పరుగులు తీఇస్తున్నారని ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. శనివారం రామకుప్పం వైసిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల క్రితం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలమనేరు నియోజకవర్గ పట్టణంలో పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారని, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి పెద్దిరెడ్డిపై అవాకులు చవాకులు పేలడం సరికాదని హితవు పలికారు. గతంలో పలమనేరు నియోజకవర్గంలో అమరనాథరెడ్డి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే వెంకట్ గౌడుకు 50 వేల పైచిలుకు ఓట్లు మెజార్టీ సాధిస్తారన్నారు. అమర్నాథ్ రెడ్డిని చిత్తుచిత్తుగా ఓడించి ప్రజలే తగిన బుద్ధి చెప్తారన్నారు. బైరెడ్డిపల్లి ఎంపీపీ రెడ్డప్ప, జడ్పిటిసి నితిన్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి సర్పంచ్లు మురళి, రాజగోపాల్ నేతలు రవి నాయక్ ,యశ్వంత్ రెడ్డి, సిద్ధప్ప తదితరులు పాల్గొన్నారు.

సోలార్ వీధి దీపాలతో పల్లెల్లో కాంతులు

ప్రజాశక్తి- సోమల: ట్రాన్స్కో ఆధ్వర్యంలో మంత్రి ఆదేశాలతో మూడు పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న సోలార్ వీధిదీపాలు సాయంత్రం వేళలో వెలుగులు వెదజల్లుతూ కాంతులీలుతున్నాయి. వైస్ ఎంపీపీ ప్రభాకర్ తమ గ్రామమైన కరకమంద గ్రామంలో సోలార్ వీధి దీపాలు అద్భుతంగా వెలుగుతున్నాయని సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేయడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో అవసరమైన చోట సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు.

ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ఎవరూహించెదరూ..!

మారుతున్న కండువాలు..

ఎప్పుడు ఎవరు ఏ పార్టీలో ఉంటారో..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడేకొద్దీ చిత్తూరు జిల్లాలో రాజకీయం వేడెక్కుతోంది... అధికార, ప్రతిపక్ష పార్టీలు గెలుపే లక్ష్యంగా ఓటర్లను ఆకట్టుకోవడంతోపాటు ఇతర పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలను తమవైపుకు తిప్పుకొనేందుకు రాజకీయ చతురత ప్రదర్శిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో జంపు జిలానీలు పెరిగిపోయారు. రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాలతో ఎవరు ఏ పార్టీలో ఉంటారో చెప్పడం కష్టమే...రాత్రి రాత్రే పార్టీ కండువాలు మార్చేస్తున్నారు. పైగా తమ పార్టీ గొప్పది... తమ నాయకుడిని మించిన నాయకుడు ఈ భూ ప్రపంచంలోనే లేదంటూ గొప్పలు చెప్పే వీరాభిమానులు.. పార్టీ మారి క్షణాల్లోనే మాట మార్చేస్తున్నారు... మారిన పార్టీనే గొప్పదని, ఆ నాయకుడే మంచివాడని పొగడటమే కాకుండా అప్పటి వరకు పార్టీని తిట్టిపోస్తున్నారు. పార్టీలను వీడుతున్న నేతలపై కూడా అయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇటువంటి నీచుడితోనా ఇంత కాలం కొనసాగామా అంటూ తిట్లదడకం అందుకుంటున్నారు.. గత పదిరోజులుగా జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలో అధికార, ప్రతిపక్ష పార్టీలో పలు చేరికలు, వీడ్కోలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన చిత్తూరులో ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వైఎస్ఆర్ వీరాభిమాని...... పార్టీకి అత్యంత విధేయుడుగా చెప్పుకొనే చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు పార్టీ ఫిరాయింపుకు పాల్పడి జనసేనాని పవన్ కళ్యాణ్ సమక్షంలో జనసేన కండువా కపుకున్నారు. అప్పటివరకు లక్ష్మీనగర్ కాలనీలోని తన పార్టీ కార్యాలయంలోని జగన్ ఫోటోలు, వైసిపి జెండాలను రాత్రికిరాత్రే తొలగించి పవన్ కళ్యాణ్ పోటోలు, జనసేన జెండాలు కట్టేశారు. తెలుగుదేశం పార్టీలో రాజకీయ రంగప్రవేశం చేసి మూడు పర్యాయాలు చిత్తూరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి 2004లో చిత్తూరు ఎంఎల్ఏగా తెలుగుదేశం నుండీ విజయం సాధించిన ఎఎస్.మనోహర్ అనుహ్య పరిణామాల మధ్య వైసిపిలో చేరి టికెట్ దక్కకపోవడంతో ఆ పార్టీని వీడారు.

మళ్లీ గత ఎన్నికల్లో తెలుగుదేశం ఎంఎల్ఏ అభ్యర్థిగా చిత్తూరు నియోజకవర్గం నుండీ పోటీ చేసి వైసిపి అభ్యర్థి జంగాపల్లి శ్రీనివాసులు పై ఓటమిపాలైయ్యారు. టిడిపి చిత్తూరు నియోజవర్గ ఇన్‌చార్జిగా ఎఎస్.మనోహర్ 2021లో పదవికి రాజీనామా చేసి కియాశీలక రాజకీయలకు దూరంగా ఉంటున్నారు. పార్టీ అధిష్టానం గురజాలకు చిత్తూరు టికెట్ కేటాయించడంతో తిరిగి తెలుగుదేశం కియాశీలక రాజకీయల్లోకి వస్తున్నట్లు ప్రకటిస్తూ తెలుగుదేశం కండువా కప్పుకున్నారు.

సికె బాబు

హ్యాట్రిక్ ఎమ్మెల్యే... 35 సంవత్సరాల పాటు చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గంలో తనకంటూ మార్కు వేసిన రాజకీయం నడిపిన సీకె. బాబు గత అసెంబ్లీ ఎన్నికల తరువాత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. తిరిగి రాజకీయల్లో కీయాశీలకంగా వ్యవహరించేలా తెలుగుదేశం కండువా కప్పుకొని గురజాల విజయం కోసం కృషి చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సంఘటనలో చిత్తూరు అసెంబ్లీ మాజీ ఎంఎల్ఏలు సీకే బాబు, ఎఎస్.మనోహర్, ఆరణి శ్రీనివాసులు తెలుగుదేశం, జనసేన ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆయన విజయం కోసం విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల్లో వారం రోజులుగా ఆత్మీయ సమావేశాల పేరిట పార్టీలో చేరికలు, వీడ్కోలు పెరిగాయి.

ఏఎస్. మనోహర్

ఆరణి శ్రీనివాసులు

ప్రజాభిప్రాయంతో ఎన్నికల మ్యానిఫెస్టో : దగ్గుబాటి పురుందేశ్వరి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ప్రజాహితం కోసమే ప్రభుత్వాల పరిపాలన ఉండాలని, దేశవ్యాప్తంగా రథాలు తిప్పుతున్నామని, ప్రజల ఆలోచనలు తీసుకుని ఎన్నికల మ్యానిఫెస్టో రూపకల్పన చేస్తామని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వైసీపీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిజెపిలో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ అన్నారు. పేదల కోసం, సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కట్టుబడి ఉన్న సంగతి గత పది సంవత్సరాలుగా చూస్తున్నాం అన్నారు. నీరవ్ మోడీ లాంటి వారికి లోన్లు ఇప్పించింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వాలే అని విమర్శించారు. పెనుబాల చంద్రశేఖర్, జల్లి మధుసూదన్ పాల్గొన్నారు.

సంక్షేమానికి సమిష్టిగా కృషి చేద్దాం.. : ఎమ్మెల్సీ కంచర్ల

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజాసంక్షేమం జరగాలంటే టిడిపి, జనసేన కూటమితోనే సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనీవారి శ్రీనివాసులు, జనసేన కుప్పం ఇంచార్జ్ నరేష్ పేర్కొన్నారు. శనివారం రామకుప్పంలో జరిగిన పార్టీ శ్రేణులు సమావేశంలో వారు మాట్లాడుతూ... వైసిపి అరాచక, అవినీతి పాలనను ఎదుర్కొనే ఉద్దేశంతోనే టిడిపి, జనసేనలు కలిసి ఉమ్మడిగా పోటీ చేయనున్నాయని, అదేవిధంగా రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చేతులు కలిపారన్నారు. టిడిపి శ్రేణులు, జనసేన సైనికులు సమన్వయంతో పనిచేసి కూటమి గెలుపుకు కృషి చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం తథ్యమని అన్ని విషయాల్లో టిడిపి శ్రేణులకు జనసేన శ్రేణులకు సమాన అవకాశాలుంటాయన్నారు. టిడిపి ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రా నారాయణాచారి, ఆనంద రెడ్డి, నరసింహులు, రామ్మూర్తి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

3 దశాబ్దాల తాగునీటి సమస్యకు పరిష్కారం

ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

ప్రజాశక్తి- నగరి : మండలంలోని నంబాకం సచివాలయ పరిధిలోని గ్రామాలకు 3 దశాబ్దాల పాటు ఉన్న తాగునీటి సమస్య మంత్రి ఆర్కేరోజా చొరవతో పరిష్కారమైంది. శనివారం బుగ్గ అగ్రహారం గ్రామం నుండి దేశూరు అగరం దళితవాడ, ఎస్టీ కాలనీ, నంబాకం, నంబాకం హరిజనవాడ, చిన్నలూరు గ్రామాలను కలుపుతూ 15వ ఫైనాన్స్ నిధులతో ఏర్పాటుచేసిన తాగునీటి పైపులైన్‌ను, తన ఛారిటబుల్ ట్రస్టు నిధులు రూ.6 లక్షలు, మండల గ్రాంటు రూ.1.20 లక్షలతో ఏర్పాటుచేసిన ఆర్వో ప్లాంటును మంత్రి ప్రారంభించి స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించారు. నూతనంగా ఏర్పాటుచేసిన మహానేత విగ్రహాన్ని ఆవిష్కరించి పూలదండవేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో నీరు ఉన్నా తాగడానికి అనువుగా లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి ఉండేదన్నారు. ఈ గ్రామాలకు తాగునీరు స్వచ్ఛమైన తాగునీరు అందించాలంటూ సుదూర ప్రాంతాల్లోని కొండ అంచుల నుంచి తాగునీటిని అందించాల్సి ఉందన్నారు. దీంతో గత పాలకులు ఎవరూ ఈ సమస్యపై దృష్టి సారించలేదన్నారు. ప్రత్యేక శ్రద్దతో అసాధ్యమనకున్న పనిని నేడు సుసాధ్యం చేయగలిగామన్నారు. సచివాలయ ప్రజలు ఇకవారి నివాస ప్రాంతాల్లోనే స్వచ్ఛమైన తాగునీటిని పట్టుకోవచ్చన్నారు. ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి, నాయకులు శేఖర్, డిల్లిబాబు, విజయులు రెడ్డి, రాజేంద్ర, దినకర్‌రెడ్డి, రవికుమార్, రంగనాథం, పరంధామరెడ్డి, రవిరాజు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నగరి పట్టణానికి ఆధునిక మెరుగులు

రూ. 9.5 కోట్ల నిధులతో భారీ ప్రణాళిక

ప్రజాశక్తి- నగరి: నగరి పట్టణానికి ఆధునిక మెరుగులు సమకూరనుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం సాయంత్రం మున్సిపల్ పరిధి ఏపీ టూరిజం ప్రాంగణంలో టూరిజం శాఖ సహకారంతో రూ.9.5కోట్ల నిధులతో నిర్మించనున్న జి అరేనా కన్వెన్షన్ సెంటర్, ఫ్యామిలీ రెస్టారెంట్, స్విమ్మింగ్ పూల్, కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు రూ. 1200 కోట్ల సంక్షేమం, రూ.500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అలాగే నియోజకవర్గానికి శిల్పారామం మంజూరు చేయించడం జరిగిందని, ప్రస్తుతం నియోకవర్గస్థాయిని పెంచే విధంగా పలు భవనాల నిర్మాణం చేపట్టడానికి భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ అరిమంద వరప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, ఇంద్రయ్య, మురుగ కోఆప్షన్ సభ్యులు ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్ కార్మికులకు వేతనాలు పెంచండి : సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: స్విమ్స్ ఆసుత్రిలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని శనివారంఉదయం కార్మికులు టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు .సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆధ్వర్యంలో స్విమ్స్ కు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో కరుణాకర్ రెడ్డి నివాస గహం వద్ద ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు.స్విమ్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్న తమను లక్ష్మీ శ్రీనివాసా కార్పొరేషన్ లో కలిపారని, టీటీడీలోని అన్ని విభాగాల్లో కార్పొరేషన్ కార్మికులకు వేతనాలు పెంచి తమకు పెంచక పోవటానికి కారణమేమిటని ప్రశ్నించారు. వేతనాలు పెంచి, హొదాలను మార్పు చేయడం ద్వారా తమకు లబ్ధి చేకూర్చాలని విజ్ఞప్తి చేశారు. స్విమ్స్ యాజమాన్యంలో కొందరు అదే పనిగా వేధింపులకు పాల్పడుతున్నారని వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి తప్పనిసరిగా ప్రయత్నిస్తామని, వేతనాలు పెంచుతామని కరుణాకర్ రెడ్డి కార్మికులకు హామీ ఇచ్చారు. స్విమ్స్ యూనియన్ నాయకులు రవి, సూరి, ముత్తు తదితరులు పాల్గొన్నారు.

జిజెఎంకు మనోహార్ మద్దతు

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం అభ్యర్థి గురజాల జగన్మోహన్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఆయన విజయం కోసం కృషి చేయనున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహార్ స్పష్టం చేశారు. తెలుగుదేశం ఇన్చార్జి పదవికి గతంలో రాజీనామా చేసిన ఏఎస్ మనోహార్ రెండు సంవత్సరాలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో గురజాల జగన్మోహన్‌ను టిడిపి అభ్యర్థిగా ప్రకటించడంతో తిరిగి తెలుగుదేశం పార్టీ తరపున క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. మనోహర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తూ టిడిపి రాష్ట్ర నాయకులు దొరబాబు, వసంత్ కుమార్, గురజాల జగన్మోహన్ కండువా కప్పి ఆహ్వానించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- నగరి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నగరి బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ రాంప్రసాద్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నగరి బ్రాంచ్ మేనేజర్ ఎస్.యువరాజ్, చెన్నైకి చెందిన ప్రముఖ వైద్యకళాశాల బృందంతో ఉచిత వైద్యశిబిరాన్ని స్థానిక ప్రైవేటు కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరానికి మున్సిపాలిటీ పరిధిలోనే కాకుండా నగరి రూరల్ మండలాలకు చెందిన వారు కూడా వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సాధారణ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేసి అవసరమైన వారికి తగు సూచనలు ఇచ్చారు. ఈ వైద్య శిబిరంలో దాదాపు 500 మంది స్థానిక ప్రజలు లబ్ధి పొందారు. నగరి బ్రాంచ్ మేనేజర్ యువరాజ్, రీజినల్ మేనేజర్ రామ్ ప్రసాద్ ఉచిత వైద్యశిబిరానికి సేవలు అందించిన ప్రముఖ చెన్నై, శ్రీపెరంబూదూర్, రాజ్యలక్ష్మి వైద్య కళాశాల, వైద్యశాల వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మయాన సేవకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా కేంద్రమైన చిత్తూరులో శనివారం స్మశానకొల్ల మయాన సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మహాశివరాత్రి మరుసటి శనివారం చిత్తూరులో బెస్త కులస్తులు, నిర్వాహకులు కెఎం.కుమార్ ఆధ్వర్యంలో కైలాసపురం వద్దనున్న నీవానదిలో స్మశానకొల్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీవా నదీ మైదానంలో దక్షుని భారీ ప్రతిమను తీర్చిదిద్దారు. అనంతరం అంకాల పరమేశ్వరి అమ్మవారి ఉత్సవ మూర్తులను భారీ ఎత్తున అలంకరించి వాయిద్యాలు నడుమ నగర పురవీధుల గుండా కైలాసపురంలోని స్మశాన కొల్ల ప్రాంతానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. దక్షుని సంహరించే కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు చిత్తూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడు అన్నదానం చేశారు.

రావణబ్రహ్మ వాహనంపై ఆదిదేవుడు

బంగారుపాళ్యం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఐదవ రోజు శనివారం ఉదయం రావణబ్రహ్మ వాహనంపై ఆదిదేవుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన వెంకటరెడ్డి కుటుంబం వ్యవహరించారని ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజులు తెలిపారు.

వైభవంగా స్వామివారి కళ్యాణం

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయితీ దుద్దే రామానాయుడు కండ్రిగ సమీపంలో ఉన్న అరుణగిరిపై వెలసిన శ్రీ కొండ మల్లేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొండ మల్లేశ్వర స్వామికి కల్యాణోత్సవం సందర్భంగా స్వామి అమ్మవార్లను అర్చకులు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు పూలతో సుందరంగా అలంకరించి కల్యాణోత్సవం చేశారు. అనంతరం స్వామివారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

గో ఆధారిత 'మట్టి మనిషి' డేగా సుబ్రమణ్యం

ప్రజాశక్తి - కెవిబిపురం

గ్రామాల్లో రైతులు రసాయన ఎరువులతో విసిగిపోయారు.. రసాయన ఎరువులతో పుడమి కలుషితమైపోయింది.. ఈ నేపథ్యంలో గో ఆధారిత వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు డేగా సుబ్రమణ్యం యాదవ్. తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయంలో ఎక్కువ లాభాలొస్తున్నాయని చెబుతున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం కెవిబిపురం మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన మట్టి మనిషి, సర్పంచి డేగా సుబ్రమణ్యం సక్సెస్ స్టోరీ అన్నదాతల కోసం...

దశాబ్ద కాలంగా వ్యవసాయ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాల మాయలో అనేక రకాల రసాయన ఎరువుల వాడకం విచ్చలవిడిగా పెరిగిపోవడం సేద్యాన్ని పతనావస్థకు చేర్చింది. భూములు నిస్సారంగా మారి, చీడపీడల ఉధతి పెరిగి

దిగుబడులు తగ్గుతూ వచ్చాయి. ఓవైపు పెరిగిన పెట్టుబడి, మరోవైపు కూలీల కొరతతో సాగు భారం రైతన్నను వెంటాడుతోంది. సంపాదనలో 80 శాతం వైద్యానికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌కు చెందిన సేవ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు విజయరామ్ సహకారంతో డేగా సుబ్రమణ్యం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయానికి శ్రీకారం చుట్టారు. ఏడేళ్ల క్రితం వరకూ ఎకరం పొలంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించిన ఆయన నేడు మూడు ఎకరాల్లో సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 400 రకాల దేశవాళీ విత్తనాలను పరిరక్షిస్తూ, ప్రధాన రకాల పంటలను స్వయంగా పండించి, ప్రాసెసింగ్ నిర్వహించి ప్రస్తుత మార్కెట్ ధరల కంటే తక్కువగా అందిస్తున్నారు. సహజ సిద్ధంగా లభించే ఆవుపేడ, సొంతంగా తయారు చేసిన జీవామృతాలు, రసాయన రహిత ఎరువుల ద్వారా పండించి సొంతంగా ఏర్పాటు చేసుకున్న మిషనరీ ద్వారా అత్యంత నాణ్యతా ప్రమాణాలతో అందించాలన్న సంకల్పంతో దేశవాళీ ప్రధాన రకాలైన భాహురూపి, నివారిణి నవార, మైసూర్ మల్లిగ, చిట్టి ముత్యాలు పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పైరు ఐదు అడుగులకు పైగా పొడవుతో సాగవుతున్న పంటల సాగు కాలం 120-140 రోజులు.

ప్రస్తుతం పండిస్తున్న రకాలు,వాటి ప్రాధాన్యత

భాహురూపి:- పంట కాలం 140 రోజులు. మోకాలి నొప్పులు, మలబద్ధకం తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచి, రోజంతా ఉత్తేజభరితంగా ఉండటానికి సహాయపడుతుంది. రోజు వారి వాడకానికి ఉపయోగపడే రకం.

నివారిణి,నవార: పంట కాలం 120 రోజులు కాగా, షుగర్ వ్యాధిగ్రస్తులకు వ్యాధి నియంత్రణలో ఉంచడానికి అత్యంత ఉపయోగకరమైన రకం. 45 రోజులు క్రమం తప్పకుండా వాడితే షుగర్ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. కిలో 80 రూపాయలు.

ఆరోగ్యమే మహాభాగ్యం : డేగా సుబ్రమణ్యం

మనిషి మనుగడ ఉన్నంత వరకూ వ్యవసాయం ఉంటుంది. ఓ రైతు ఓ నాటు ఆవు పెంచుకుంటే ఒక ఎకరా ప్రకృతి వ్యవసాయం చేయవచ్చు. ఆవుపేడతో ప్రమిదలు, గోపంచితం లీటర్ పది రూపాయల లెక్కన అమ్ముతున్నాం. ప్రకృతి వ్యవసాయంలో పండే పంటలు తినడం వల్ల మా ఇంట్లో ఎవరికీ ఏ జబ్బులూ రావడం లేదు. మా అమ్మ వయస్సు 95 సంవత్సరాలు. ఇప్పటికీ ఏ జబ్బు లేకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నారు. బీపీ, సుగర్ వ్యాధులు లేవు. ఆరోగ్యంగా సంతోషంగా జీవిస్తున్నాం.

'ఆర్పీ'లకు తప్పని 'వెట్టి'

• రాజకీయ ఒత్తిళ్లతో పనిభారం • చెత్త పన్నుల వసూళ్లకూ వీరే

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న ఆర్‌పిలు వెట్టిచాకిరీతో సతమతమవుతున్నారు. పనులు సక్రమంగా చేయలేదంటూ పనిష్మెంట్ విధించడమే గాకుండా రాజకీయ ఒత్తిళ్లు పెరిగాయి. మెప్మా విభాగంలో పట్టణాల్లో పనిచేస్తున్న ఆర్‌పిలకు మూడు నెలలకు ఒకసారి, ఐదు నెలలకు ఒకసారి వేతనాలు ఇస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వడంలో ఆర్‌పిలు కీలకపాత్ర పోషిస్తున్నారు. పని గంటలతో ప్రమేయం లేకుండా పనిచేస్తున్న వీరికి కనీస వేతనం ఇవ్వకుండా, ఆందోళనలు చేస్తే ఉద్యోగాలు ఊడగొడతామని హెచ్చరికలతో వారు మానసికంగా కుంగిపోతున్నారు. గతంలో తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌లో ఉండే ఓ ఆర్‌పి వైసిపి రాజకీయ నేతల ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే.

వేతన పెంపు ఏది?

ఆర్‌పిలకు కనీస వేతనం 10వేల రూపాయలు. అది కూడా సక్రమంగా ఇవ్వని పరిస్థితి. తిరుపతి జిల్లాలో దాదాపు 350 మంది రిసోర్స్ పర్సన్లుగా పనిచేస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్తలో యానిమేటర్లకు 10వేలు వేతనం ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. అయితే ఇంతవరకూ వారికి రూ.10వేలు ఇచ్చిన దాఖలా లేదు. సాంకేతిక కారణాల పేరుతో ప్రతినెలా వేతన చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి రుణాలు ఇప్పించడంలో తోడ్పాటు చేయాలి. కొత్త గ్రూపులు ఏర్పాటు చేయాలి. పట్టణాల్లో చెత్త సేకరణ నిర్వహణ బాధ్యత వీరిదే. టిడ్కో గృహాలు 35వేల రూపాయల రుణం ఇప్పించాలి. ఒటిఎస్ వసూళ్లు వీరే చేయాలి. జగనన్న తోడు లబ్దిదారుల ఎంపిక మహిళా గ్రూపులకు బ్యాంకు లింకేజి బాధ్యత వీరిదే. స్త్రీ నిధి, ఆసరా పథకాలకు మొబైల్ బ్యాంక్ కీపింగ్ పనులు వీరే చేయాలి. ఇతర పనులు అధికమవడం, మొబైల్‌నెట్ వర్కు సాంకేతిక

కారణాల నేపథ్యంలో అధికశాతం మంది పనులు చేయడం లేదు. వర్కు డన్ పనులు చేయలేని వారి వేతనాల్లో కోత విధిస్తున్నారు. అనేక కుంటిసాకులు చెప్పి వారికి 5వేల నుంచి ఆరువేలు మాత్రమే చెల్లింపులు చేస్తున్నారు. 45 సంవత్సరాలు పైబడిన వారిని తొలగిస్తున్నారు. రాజకీయ వేధింపుల నుంచి వారికి విముక్తి లభించడం లేదు.

ఆర్‌పిలకు రూ.26వేలివ్వాలి

సాయిలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి

ఆర్‌పిలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలి. రాజకీయ నాయకుల వేధింపులు మానుకోవాలి. ప్రతినెలా జీతాలు చెల్లించాలి. రాజకీయ సమావేశాలకు ఆర్‌పిలను ఉపయోగించుకోవడం మానుకోవాలి. పనిభారం తగ్గించాలి.

క్రైం న్యూస్

సాగునీటి పంపకాల్లో ఘర్షణ

వేట కొడవలితో అన్నపై దాడి

చికిత్స పొందుతున్న నాగరాజు

ప్రజాశక్తి- పుంగనూరు: పంట పొలాలకు సాగునీరు మొట్టమొదటగా నేనే కట్టుకోవాలని అన్నపై తమ్ముడు దౌర్జన్యంగా వేట కొడవలితో దాడి చేశారు. బాధితుడు పూల నాగరాజు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మదనపల్లి మండలం అరవవాండ్ల ఇండ్లకు చెందిన లేట్ నరసింహులు కొడుకు పూల నాగరాజు వరుసకు తమ్ముడైన పూల ప్రేమ్ కుమార్‌లకు పుంగనూరు మండలం చంద్రమకులపల్లి పంచాయతీ పరిధిలో వ్యవసాయ భూములు ఉన్నాయి. తమ్ముడు వరసైన పూల ప్రేమ్‌కుమార్ 3ఎకరాలు, పూల నాగరాజు 2.5 ఎకరాలు పొలం ఉంది. వీరు వ్యవసాయ పొలం వద్ద రోజు మార్చి రోజు బోరు నుండి నీరు వాడుకోవలసి ఉన్నది. అయితే పూల ప్రేమ్‌కుమార్ అన్నదమ్ములపైన, వారి తల్లిదండ్రుల పైన గొడవలు చేస్తుండేవాడు. గతంలో కూడా వీరి భూ సమస్యలపై గొడవలకు దిగి దాడి చేసి గాయపరచడం తరుచూ జరుగుతూనే ఉన్నదని తెలిపారు. అదేవిధంగా శనివారం కూడా అతనికి ఎలాంటి సంబంధం లేకపోయినా దౌర్జన్యంగా సాగునీరు వదలాలని గొడవపడి పూల నాగరాజు పై వేట కొడవలితో దాడి చేసి కిందకు తోసివేసి చంపేస్తానని బెదిరించాడు. నాగరాజుకు తీవ్ర రక్తగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించి చికిత్స అందించారు. అనంతరం జరిగిన దాడిపై నాగరాజు ప్రేమ్ కుమార్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

పాముకాటుతో బాలిక మృతి

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని కెళవాతి గ్రామానికి చెందిన యశ్వంతి(9) శనివారం ఇంట్లో నిద్రిస్తుండగా పాముకాటుకు గురై మృతిచెందింది. తల్లిదండ్రులు రెడ్డప్ప, బిందు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి అందరూ కలిసి ఇంట్లో నిదిరిస్తుండగా శనివారం తెల్లవారుజామున యశ్వంతిని పాటు కరిచిందని, వెంటనే పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగానే యశ్వంతి పరిస్థితి విషమించి మృతి చెందిందని తెలిపారు. యశ్వంతి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెడ్డప్ప, బిందులకు ఇద్దరు కుమార్తెలు అందులో మొదటి కుమార్తె మరణించడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు కన్నీటిపర్యంతమైంది.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామకుప్పం: మండలంలోని పంద్యాల మడుగు పంచాయతీ కావలి మడుగు గ్రామానికి చెందిన సర్వేశ్ అనే టిడిపి కార్యకర్త శనివారం మృతి చెందాడు. టిడిపి నాయకులు సర్వేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు చంద్రారెడ్డి, గంట్లగౌడు, అప్పాల, పరుశురాం, మునిరాజు నాయక్, రమణ, గంట్లప్ప, ఉమేష్ ఉన్నారు.

విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామస్వామి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే వారికే తమ మద్దతు ఉంటుందని విశ్వబ్రాహ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామస్వామి తెలిపారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల కోసం ఫెడరేషన్ ఏర్పాటు చేస్తే, ప్రస్తుత ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని తెలిపారు. జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్పొరేషన్ అందులోని చైర్మన్లు, డైరెక్టర్లకు జీతాలు ఇచ్చేందుకు తప్ప బ్రాహ్మణులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఓటర్లుగా ఉన్న ఏ రాజకీయ పార్టీ తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కనీసం నామినేటెడ్ పదవులను కూడా ఇవ్వకుండా ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దయానంద్ ఆచారి, శరవణ ఆచారి, రమేష్, హేమచంద్ర, నవీన్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉచిత కంటి అద్దాలు పంపిణీ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోనియా శనివారం ఆరోగ్య కేంద్రం పరిధిలోని 42 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు బస్టాండ్ పక్కన గల రిక్రియేషన్ క్లబ్‌లో 10వ తేదీ ఆదివారం మెగా మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు క్లబ్ సభ్యులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మెడికల్ క్యాంపులో జాగృతి దయాగ్నోస్టిక్ సెంటర్ వారు బిపి, షుగర్, రక్తపరీక్షలు, కిడ్నీ పరీక్షలు, డెంగీ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలు వంటి 37 రకాల పరీక్షలను రూ.799లకే చేశారని తెలిపారు. ఈ అవకాశాన్ని పలమనేరు పుర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ సభ్యులు కోరారు.

ఇళ్ల స్థలాల బాధితులంటే అలసత్వం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

కరకంబాడిలో పేదలు వేసుకున్న గుడిసెలు కూల్చేసిన అధికారులు అర్హుల లిస్టులు ప్రకటించడంలో అలసత్వం వీడి పేదలకు ఇంటి స్థలం చూపించాలని వక్తలు డిమాండ్ చేశారు. శనివారం వేమన విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 31 లక్షల మందికి ఇళ్లస్థలాలు ఇచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే కరకంబాడిలోనూ, తిరుపతిలోనూ వేలాది మందికి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపక ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు నగరంలో 2500 మంది అర్హులకు పట్టాలు ఇవ్వలేదని స్వయంగా మున్సిపల్ అధికారులే తెలిపారని చెప్పారు. ఒకవైపు జిల్లా కలెక్టర్ అర్హులకు స్థలాలు ఇవ్వమని ప్రకటిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయిందని చెప్పారు కనీసం అర్హుల లిస్టు కూడా ప్రకటించలేని దుస్థితిలో రెవెన్యూ యంత్రాంగం ఉందని తెలిపారు సిద్దుల రవి పై 2018లో తీర్పు చెప్పిన దానిని అమలు చేయక కబ్జాదారుడికి అండగా ఉంటున్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా అక్రమాలు అరికట్టాలని కోరారు. ఈ రౌండ్ సమావేశంలో శివానందం, రాజశేఖర్ సత్య శ్రీ, దీప, ప్రకాష్ పాల్గొన్నారు

జనసేన టికెట్ ఇస్తే పోటీ చేస్తా : సుగుణమ్మ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి అసెంబ్లీ టిడిపి నుంచి పోటీ చేయాలని ఆశతో ఉన్నానని, అయితే బిజెపి జనసేన పొత్తులో భాగంగా టిడిపి తిరుపతి అసెంబ్లీ సీటు వదులుకోవాల్సి వచ్చిందని తిరుపతి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. శనివారం అలిపిరి వద్ద టీడీపీ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం జరిగింది. పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ టికెట్ జనసేనకు కేటాయించారని, జనసేన పార్టీ తనకు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఆ పార్టీ తరపున పోటీ చేయడానికి తను సిద్ధంగా ఉన్నానని ఘంటాపథంగా పేర్కొన్నారు. వైసిపి పాలనలో తిరుపతిలో జరుగుతున్న అరాచకాలకు తాను నిత్యం పోరాటం చేయడమే కాకుండా ప్రజలకు కష్టసుఖాల్లో అండగా ఉన్నానని చెప్పారు. వైసిపి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడిపోవాలంటే తనకు టికెట్ ఉంటే గట్టిగా ఓడిస్తానని సుగుణమ్మ తెలియజేశారు. తిరుపతి టికెట్టు జనసేన పార్టీకి తాను సమర్థవంతమైన అభ్యర్థి అని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి నియోజకవర్గ పరిశీలకులు చిట్టిబాబు, టిడిపి నాయకులు కష్ణ యాదవ్, దంపూరి భాస్కర్ యాదవ్, బుల్లెట్ రమణ పాల్గొన్నారు.

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి బస్టాండ్ ఎదురుగా ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్‌కు వెళ్లేరహదారి వైపు రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి పనుల నిర్మాణానికి శనివారం తిరుపతి ఎమ్మెల్యే, టీటీడి చైర్మెన్ భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా, తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణలు శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ రైల్వే గేట్ మూసివేసిన తర్వాత రైల్వే ట్రాక్ దాటుతూ చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారని, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డిల సూచనల మేరకు ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఎంపీ నిధులు, తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో నిర్మాణం చేయనున్నారని తెలియజేశారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ ఇక్కడ నిర్మిస్తున్న రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జికి అంచనా మొత్తం 2 కోట్ల 17 లక్షలు కాగా, తిరుపతి ఎంపి నిధుల నుండి 75.8 లక్షలు కేటాయించగా, తిరుపతి నగరపాలక సంస్థ నిధుల నుండి 1 కోటి 41 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తాళ్ళూరి రత్నప్రసాద్, ఇతర కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, మురళీకష్ణ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు ఖాదర్ భాష, రైల్వే అధికారులు గుంతకల్ డివిజన్ డి.ఆర్.ఎం వినీత్ సింగ్, ఏడి.ఆర్.ఎం సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమ్మెకాలం హామీలు అమలు చేయాలి :కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - గూడూరు టౌన్

రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. గూడూరు సిఐటియు కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోపలే సమ్మె కాలం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్‌వాడీలు మరో పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. అంగన్‌వాడీల సుదీర్ఘ పోరాటాల సందర్భంగా ఒకేసారి నాలుగు జీవోలు సాధించుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, గూడూరు సిపిఎం సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, నాయకులు బివి రమణయ్య, సురేష్, ప్రసాద్, సెక్టార్ లీడర్లు లక్ష్మి, పెంచలమ్మ, ఆసియా, ఉమా, మంగమ్మ, దిల్‌షా, బి.చంద్రయ్య పాల్గొన్నారు.

కుప్పం మైనార్టీ సెల్ అధ్యక్షులుగా బర్కతుల్ల..!

ప్రజాశక్తి - రామకుప్పం: కుప్పం నియోజకవర్గ వైసిపి మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షులుగా రామకుప్పం మండలం కెంచనబల్ల గ్రామానికి చెందిన బర్కతుల్లను ఎన్నుకున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షులు భరత్ ఓ ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చినందుకు సీఎం జగన్ మోహన్ రెడ్డికి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) :: PUTTUR
I.P.No. 17 OF 2023
Between
Tangala Sekhar ...Petitioner
And
T.Murali Reddy and others ...Respondents
To
P.Prathap (Respondent No.17) son of Vijayarathnam, residing at Eguvagerigidhona Village, Mambedu Post, Vedurukuppam Mandal, Chittoor District.
NOTICE TO THE RESPONDENT No.17
Please take Notice that the above petition filed by the petitioner against you and others on the file of the Hon'ble Senior Civil Judge, Puttur. The said case is posted for your notice on 03.04.2024. If you failed to appear in person or through an Advocate on 03.04 2024 at 10.30 AM before the said Court, thus the matter will be decided as ex-parte.
This is the order of the Hon'ble Court.
SRI B.V CHALAPATHI,
ADVOCATE FOR PETITIONER
PUTTUR

IN THE COURT OF THE VIII ADDL. DISTRICT JUDGE, CHITTOOR
I.A.No. 63 /2023
A.S.No. 136 /2016
O.S.No. 385 /2001
On the file of Prl.Jr.C.J,Chittoor
Betwen
Perugu Lakshmamma & another ....Appellants/ Plaintiffs
And
P.Pandurangaiah & others ....Respondents/Defendants
NOTICE TO 85 & 86 DEFENDANTS / 85 & 86 RESPONDENTS
1.Chitti D/o Jyothi Reddy, Hindu , aged about 40 years
2.Saritha,D/o Jyothi Reddy, Hindu, aged about 38 years
Both are residing at Digital D.No.189, V.G.Nagar,Mittoor Extention, Chittoor Town and District, AP
Madam,
Where as the above petitioner filed the above I.A.No.63 of 2023 for set aside the abatement of appeal you as proposed defendants 85 and 86 in the above appeal as LRs of deceased respondents No.48. The above said interlocutory application stands posted to 02-04-2024 for your notice and appearance before the said court, please be present at about 10-30 A.M on the said date either in person ,or through an Advocate failing which,matter will be decided in your absence.
Hearing Date :02-04-2024
(SRI D.JANARDHANA NAIDU)
Advocate,Chittoor,Cell:9440958395

IN THE COURT OF THE VIII ADDL. DISTRICT JUDGE, CHITTOOR
I.A.No. 62 /2023
A.S.No. 136 /2016
O.S.No. 385 /2001
On the file of Prl.Jr.C.J,Chittoor
Betwen
Perugu Lakshmamma & another ....Appellants/ Plaintiffs
And
P.Pandurangaiah & others ....Respondents/Defendants
NOTICE TO 85 & 86 DEFENDANTS / 85 & 86 RESPONDENTS
1.Chitti D/o Jyothi Reddy, Hindu , aged about 40 years
2.Saritha,D/o Jyothi Reddy, Hindu, aged about 38 years
Both are residing at Digital D.No.189, V.G.Nagar,Mittoor Extention, Chittoor Town and District, AP
Madam,
Where as the above petitioner filed the above I.A.No.62 of 2023 for set aside the abatement of appeal you as proposed defendants 85 and 86 in the above appeal as LRs of deceased respondents No.48. The above said interlocutory application stands posted to 02-04-2024 for your notice and appearance before the said court, please be present at about 10-30 A.M on the said date either in person ,or through an Advocate failing which,matter will be decided in your absence.
Hearing Date :02-04-2024
(SRI D.JANARDHANA NAIDU)
Advocate,Chittoor,Cell:9440958395